క్లుప్తంగా

అన్నదానం పవిత్ర కార్యం



పట్నంబజారు: అత్యంత పవిత్రమైన కార్తికమాసంలో మాలదీక్షదారులకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. లాలాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం పార్టీ నేతలు కీసర వెంకటసుబ్బారెడ్డి, సుబ్బులు ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది అయ్యప్ప, భవానీ స్వాములు, ఇతర భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, ఇతరులకు సహాయ పడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు



పట్నంబజారు: గుంటూరు నగరంలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ర్యాష్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్ చేస్తున్న విద్యార్థులు, యువతను వాహనాలను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ పర్యవేక్షణలో జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో 20 వాహనాలు సీజ్ చేశారు. వాహనాలను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించగా, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-4 డీఈ పి.హుస్సేన్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్ సబ్‌స్టేషన్ కాంపౌండ్ వాల్‌లో వాటర్ సప్లై డిస్ట్రిబ్యూషన్ పైపు లైన్ లీకేజీ నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, వెంకటాద్రిపేట, మోతీలాల్‌నగర్ ప్రాంతాలకు చెందిన వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది నిలదీత

నెహ్రూనగర్: ఇంటి పన్ను కోసం దరఖాస్తు పరిష్కరంలో నిర్లక్ష్యంపై కార్పొరేషన్ సిబ్బందిపై బాధితుడి ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గుంటూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి పన్ను వేయించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అనుకున్నంత డబ్బులు ఇచ్చినప్పటికి పన్ను వేయకపోవడంతో సదరు దరఖాస్తుదారుడు రెవెన్యూ అధికారులను నిలదీశారు. ఫైల్ మా దగ్గర నుంచి ముందుకు వెళ్లింది... డెప్యూటీ కమిషనర్ లాగిన్‌లో ఉందని... అక్కడ అప్రూవ్ కాలేదని... చెప్పడంతో సదరు వ్యక్తి రాత్రి డెప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్దకు వచ్చి సిబ్బందితో వాగ్వివాదానికి దిగాడు. గొడవ పెద్దది కావడంతో సిబ్బంది అతనికి సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించివేశారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఒకటిన ఆలూరి బైరాగి సభ

తెనాలి: మానవ జీవితంలో ఆధునికత వైపరీత్యాలను తాత్వికంగా వ్యతిరేకించిన తొలి తెలుగు కవి, తెనాలికి చెందిన ఆలూరి బైరాగి శతజయంతి సభను డిసెంబరు ఒకటో తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. అరసం ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం 10 గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారు. హిందీ అకాడమీ విశ్రాంత ఛైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

ఆధునిక జీవన విధానంతో పైల్స్ ముప్పు

- వ్యాధి బారిన పడుతున్న యువత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్యులు



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలితో కొన్ని వ్యాధులు బాధిస్తున్నాయి. అందులోనూ చిన్న వయస్సులోనే పైల్స్ బారిన పడుతున్నారు. కాలేజ్ విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా వ్యాధి బారిన పడుతున్నారు. మొలలు లేదా పైల్స్ అనేవి సాధారణంగా 50 ఏళ్ల వయస్సువారిలో సగం మందిలో ఎక్కువ చూస్తుంటాం. మొలలు అనేవి మగవారిలో, ఆడవారిలో సాధారణంగా వస్తాయి. మొలలు ఉన్నవారికి తరచుగా ఇబ్బంది కలుగుతూ ఉంటాయి. మాటల్లో వారు తమ బాధను చెప్పుకోలేరు. పైల్స్ ఉన్నవారు ఎక్కువసేపు కూర్చున్నా, తిరుగుతున్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది. హెమోరాయిడ్స్‌గా పిలిచే మొలలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కారణాలు...

మల విసర్జన కష్టంగా ఉండి మామూలుగా కాకుండా తక్కువగా మలవిసర్జన జరుగుతుంటే దానిని మలబద్ధకం అంటారు. ఇలాంటి సమయాల్లో ఎక్కువ ముక్కినప్పుడు అన్నవాహిక చివరి భాగంలో, మలద్వారానికి పైన పురీష నాళం చివరిన వాచిపోయిన రక్తనాళాలను మొలలు అంటారు. మొలలు మలద్వారం నుంచి బయటకు పొడుచుకొచ్చిగాని అంతర్లీనంగా పురీష నాళంలోనే పెరిగే అవకాశం ఉంది. మొలలు ఏర్పడటానికి ప్రధాన కారణం మలబద్ధకం. కొందరిలో మలద్వారం దగ్గర ఉండే సిరలు బలహీనంగా ఉండటం వలన మొలలు వస్తాయి. వంశ పారం పర్యంగా మొలలు వచ్చే అవకాశం ఉంది. వ్యాయామం చేయకపోవటం, అధిక బరువు ఉండటం, గర్భం దాల్చినప్పుడు, ఆహారపు అలవాట్లు, పీచు పదార్థాలు తక్కువగా ఉండే ఆహారం తినటం ద్వారా పైల్స్ వచ్చే అవకాశం ఉంది. ఒకేచోట ఎక్కువ సేపు కూర్చొని పనిచేయడం, మానసిక ఒత్తిడి, మద్యపానం, నీరు తక్కువగా తాగడం, మాంసాహారం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం చేసేవారిలో పైల్స్ వస్తాయి.

లక్షణాలు...

మలద్వారం చుట్టూ దురదగా ఉంటుంది. మల విసర్జన సమయంలో నొప్పి ఉండి వాచి లేదా ఉబ్బుగా ఉంటుంది. మల విసర్జన సమయంలో లేదా అనంతరం రక్తస్రావం జరుగుతుంది.

బాధితులు...

గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్య విభాగానికి ప్రతిరోజూ పది మంది పైల్స్ సమస్యతో చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో 120 మంది జనరల్ సర్జన్లు, పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ ఇరువురు మొలల బాధితులు చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

నివారణ చర్యలు...

పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ద్రవ పదార్థాలు, ప్రత్యేకంగా నీరు ఎక్కువగా తాగాలి. పండ్లు, ఆకు కూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఎక్కువగా శ్రమపడి ఒత్తిడి కలిగేలా మల విసర్జన చేయకూడదు. కారం, మసాలాలు, పచ్చళ్లు, వేపుళ్లు, దుంప కూరలకు దూరంగా ఉండాలి.

ఆపరేషన్లతో నయం చేయవచ్చు



పైల్స్ బాధితులకు ఆపరేషన్లలో అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. స్టాప్లర్, లేజర్, హాల్స్, ల్యాప్రోస్కోపిక్ వంటి ఆధునిక చికిత్సా విధానాల ద్వారా ఎక్కువ నొప్పి, గాయం లేకుండా చేసే శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. అతి తక్కువ కోత, కుట్లతో ఆపరేషన్లు చేస్తున్నారు. పైల్స్ రాకుండా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

– డాక్టర్ నజీరుద్దీన్,
సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, గుంటూరు

డిసెంబర్ 2 నుంచి ప్రవచనాలు

నగరంపాలెం: డిసెంబర్ 2 నుంచి సమన్వయ సరస్వతీ, వాగ్దేవి వరపుత్ర బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ 'శ్రీవిష్ణు సహస్రనామ భాష్యం' ప్రవచనం నిర్వహించనున్నట్లు శ్రీ శారదా పరమేశ్వరీ దేవస్థానం నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపత్‌నగర్‌లోని దేవస్థానంలో డిసెంబర్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి ప్రవచనాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ జువాలజీ, కెమిస్ట్రీ, ఎంఏ ఎకనామిక్స్, కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏపీ పీజీ సెట్‌కు హాజరు కాకున్నప్పటికీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆయా సబ్జెక్టుల వారీగా 92464 52235(జువాలజీ), 99859 04415 (కెమిస్ట్రీ), 98488 98289 (ఎకనామిక్స్) సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏఎన్‌యూలో విద్యార్థినుల ధర్నా

- భోజనంలో కప్పలు వస్తున్నాయంటూ నిరసన
- విద్యార్థినులతో చర్చలు జరిపిన రిజిస్ట్రార్



ధర్నా చేస్తున్న విద్యార్థినులు

పెదకాకాని: భోజనంలో జర్రిలు, కప్పలు వస్తున్నా పట్టించుకోవడం లేదంటూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళ వసతి గృహం విద్యార్థినులు శుక్రవారం రాత్రి ధర్నాకు దిగారు. భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థినులందరూ భారీ సంఖ్యలో వచ్చి నిరసన తెలిపారు. నిర్లక్ష్యం వీడాలని, తమకు మంచి భోజనం పెట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భోజనంలో కప్పలు, పురుగులు వస్తున్నాయని ఎన్నిసార్లు చెప్పినా వార్డెన్, అధికారులు పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం వారి వద్దకు చేరుకుని చర్చలు జరిపారు. విద్యార్థినులు తమ సమస్యను పరిష్కరించాల్సిందేనని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పెదకాకాని పోలీసులు యూనివర్సిటీకి చేరుకుని విద్యార్థినులతో చర్చలు జరిపారు.

ఫొటోగ్రఫీ లేని వ్యవస్థను ఊహించలేం

20 మంది ఫొటోగ్రాఫర్లకు సత్కారం



ఫొటోగ్రాఫర్‌ను సత్కరిస్తున్న అతిథులు

నగరంపాలెం: సమాజంలో ఫొటోగ్రఫీ లేని వ్యవస్థను ఊహించలేమని విశ్రాంత ఎస్పీ డి.కోటేశ్వరరావు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని పద్మావతి కళ్యాణ వేదికపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఫొటో ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఎస్పీ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో లలిత కళల్లో చిత్ర లేఖనం తర్వాత ఫొటోగ్రఫీ అత్యున్నత స్థానంలో విరాజిల్లుతుందని అన్నారు. పోలీస్ వ్యవస్థలో నేరస్తులను కోర్టుల్లో హాజరుపరిచేందుకు సాక్ష్యాధారాల్లో ఫొటోగ్రఫి చాలా కీలకమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకుపైగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఫొటోగ్రఫీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అకాడమీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి జిల్లాకు గర్వకారణమని చెప్పారు. విశిష్ట అతిథి ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆఫ్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక ఫొటోగ్రాఫ్ లక్ష మెదళ్లకు ఆలోచనలను కల్పిస్తుందని అన్నారు. అధ్యక్షత వహించిన అకాడమీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ జీవన విధానంలో ఫొటోగ్రఫీ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఫొటోగ్రఫీ నూతనత్వాన్ని పెంచేలా సంఘ సభ్యుల సహకారంతో విస్తృతంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వివిధ రంగాల్లోని 20 మంది ఫొటోగ్రాఫర్లను జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. విశ్రాంత ఎస్పీ నాగరాజు, ఏపీ ఫొటోగ్రఫీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, మాలతి, సభ్యులు పాల్గొన్నారు.

అద్దె భవనాలకు దరఖాస్తులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ అవసరాలకు అద్దె భవనాలు అవసరమని, నగరంలో ఆసక్తి కలిగిన భవన యజమానులు ఖాళీగా ఉన్న భవన వివరాలను శనివారం సాయంత్రానికి అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో క్రెడాయ్, నెరెడ్కో ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం పారిశ్రామికంగా, ఐటీ పరంగా పలు సంస్థలను ఆహ్వానిస్తుందని, అందులో భాగంగా వచ్చే సంస్థల కార్యాలయాల కోసం ప్రత్యేకంగా భవనాలు అవసరమన్నారు. అద్దె ప్రాతిపదికన భవనాలు తీసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆసక్తి కలిగిన భవన యజమానులు తమ భవన సమగ్ర వివరాలను నిర్దేశిత ఫారంలో నింపి అందించాలని కోరారు. అందిన ఫారాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అద్దె, కాల పరిమితి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, సిటీ ప్లానర్ రాంబాబు, క్రెడాయ్ నుంచి శివారెడ్డి, రాము, సాంబశివారెడ్డి, నెరెడ్కో నుంచి దుర్గా ప్రసాద్, శ్రీనివాస కుమార్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కొనుగోళ్ల పేరుతో దోచుకుంటున్న దళారులు

- పత్తి క్వింటాకు 6-7 కేజీలు తీసివేతలు
- ఏఎంసీకి ముందే క్వింటాకు రూ.20-30 చెల్లించాల్సిందే
- వారాలు గడుస్తున్నా అకౌంట్‌లలో జమ కాని నగదు



సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు విక్రయించేందుకు తెచ్చిన పత్తి

గుంటూరు రూరల్: పత్తి రైతును దళారులు దోచేస్తున్నారు. పత్తిని వాహనాల్లో బోరాల ద్వారా తెస్తే కాటాలను సీసీఐ కొనుగోలు చేస్తున్న కేంద్రాల వద్దే ఏర్పాటు చేసి కాటాలను మేనేజ్ చేస్తూ కొంతమేర దోచుకుంటున్నారు. అక్కడి నుంచి కొనుగోలు చేసే బయ్యర్ల వద్దకు వెళ్తే బోరానికి 6-7 కిలోలు కోతలు విధించి లెక్కలు గడుతున్నారు. ఈ విధంగా ఒక రైతు పది క్వింటాళ్లను విక్రయానికి తీసుకెళితే అందులోంచి 60-70 కిలోలు తీసివేతల్లో తీసివేస్తున్నారు. ఆరుగాలం పండించిన పంటను ఈ విధంగా తరుగు, గుడ్డికాయ తదితర సమస్యల పేరుతో ఈవిధంగా తగ్గించి కాటాలను వేసి రైతులను నట్టేట ముంచుతున్నారు. అక్కడి నుంచి ముందుకెళితే బోరాలను దించాలన్నా, కాటా నగదు లెక్కించాలన్నా ఏఎంసీకి క్వింటాకు రూ.20-30 రూపాయలు చెల్లిస్తేనే రైతుకు నగదు ఉపశమనం స్లిప్పులు ఇస్తున్నారని అంటున్నారు. ఇంత చెల్లించి రైతులు తాను పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తున్న మిల్లుల వద్ద విక్రయిస్తే కనీసం వారాలు గడుస్తున్నా నేటికి తమ ఖాతాల్లో నగదు జమ కాలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్వింటా పత్తి రూ.7,300 నుంచి రూ.7,400 మధ్య కొనుగోలు చేస్తున్నారు. అందులో రైతు తాను పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల వద్దకు తరలించాలంటే వాహనానికి లోడు చేయించే ముఠాకు కనీసం రూ.3000, మోకులు లాగే కూలీలకు రూ.1500, దిగుమతి కూలీలకు రూ.1000, రవాణా చార్జీలు ఇదే జిల్లాలో ఐతే మరో రూ.5,000. ఇతర జిల్లాల నుంచి ఇంకా ఎక్కువే, ఒక ట్రాక్టర్ సుమారు 25 క్వింటాళ్ల పత్తిని తీసుకెళితే ఖర్చు రూపంలో రూ.10,500కి పైగా కనిపిస్తుంది. ఇది ఇలా ఉంటే ఏఎంసీ ఖర్చుల కింద క్వింటాకు రూ.20-30 కట్టాలి, అవి రూ.750, క్వింటాకు 5-6 కిలోల కోత ఈ విధంగా రూ.444 క్వింటాకు కోత, ఇలా ఒక క్వింటాకు రూ 1200 దోపిడి జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నల్లపాడు అగస్తేశ్వరాలయంలో కార్తిక దీపోత్సవం

గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీ అగస్తేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పవన్‌కుమార్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం స్వామికి ప్రత్యేకంగా విశేష పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహిస్తారన్నారు.

కనుల పండువగా కళ్యాణ మహోత్సవం



గుంటూరు రూరల్: నల్లపాడు- వెంగళాయపాలెం రోడ్డులోని స్వయంభూ శ్రీ పుష్పాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 4 గంటలకు సహస్ర దీపాలంకరణసేవ, కోటి దీపోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు కార్తిక వన సమారాధన చేశారు. కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

రేపు కృష్ణారావు వర్ధంతి సభ



లక్ష్మీపురం: కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి నిరంతరం శ్రమించిన అమరజీవి జీవీ కృష్ణారావు ఎనిమిదో వర్ధంతి సభ డిసెంబర్ 1న నిర్వహించనున్నట్లు హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. స్థానిక రేగుల రాఘవయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంగడిగుంటలోని రేగుల రాఘువయ్య భవన్‌లో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉన్నత విలువలతో జీవించిన జీవీ కృష్ణారావు లేని లోటు పూడ్చలేనిదన్నారు. కార్మిక వర్గ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించారని తెలిపారు. జీవీకే మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అమ్మిశెట్టి శివ మాట్లాడుతూ జీవీ కృష్ణారావు వర్ధంతి సందర్భంగా సామాజిక జీవితంలో ఉత్తమ పాత్ర నిర్వహించిన వ్యక్తులకు జీవీ కృష్ణారావు పేరుతో ప్రతి సంవత్సరం జీవీకే అవార్డును ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం కూడా మున్సిపల్ యూనియన్ నాయకులు నెక్కంటి సుబ్బారావుకు ఈ అవార్డును అందజేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర గౌరవ అధ్యక్షుడు జి.సురేష్ బాబు, అధ్యక్షుడు రావుల అంజిబాబు పాల్గొన్నారు.

ఏపీ మహిళా బాడీబిల్డర్ ఎస్తేరురాణికి అభినందన



ఎస్తేరురాణికి ప్రిన్సిపల్ కంట్రోలర్ అభినందన

తెనాలి: ఆంధ్రప్రదేశ్ నుంచి తొలి మహిళా బాడీబిల్డర్ రావూరి ఎస్తేరురాణిని తెనాలికి చెందిన అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో అభినందన సత్కారం చేశారు. హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ కటికల వెంకటరావు చేతులమీదుగా ఈ సన్మానం జరిగింది. ఎస్తేరురాణి స్వస్థలం తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన వేమూరు. హైదరాబాద్‌లో జిమ్‌ట్రైనర్‌గా ఉంటూ బాడీబిల్డింగ్‌లో సాధన చేస్తున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్‌లో 'మిస్ ఇండియా' టైటిల్‌తో బంగారు పతకం సాధించి, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో 'యాక్ట్' వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు, స్నేహ గ్రూప్ ఆర్గనైజేషన్స్ చైర్మన్ డాక్టర కటికల శివభాగ్యరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని వీధి దీపాలు, తాగునీటి సరఫరాపై అందే ఫిర్యాదులను స్థానిక సచివాలయ కార్యదర్శులు బాధ్యతతో పరిష్కారం చేయాలని, రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలి దశలోనే అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. నల్లచెరువు, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు సచివాలయం పరిధిలో ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తదుపరే బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేస్తామని చెప్పారు. రోడ్ల డ్రెయిన్ల మీద ఆక్రమణలను తొలి దశలోనే గుర్తించి తొలగించాలని కోరారు. రెడ్డిపాలెం రోడ్డులో కల్వర్ట్ వద్ద వ్యర్థాలు అడ్డుగా ఉండడం గమనించి, వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు నూతన రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనల్లో తప్పనిసరిగా ఎండ్ టు ఎండ్ రోడ్, డ్రెయిన్లు ఉండేలా చూడాలన్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ మధుసూదన్, ఏసీపీ మల్లికార్జున పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఆమోదం హర్షణీయం



మేయర్ కావటిని కలసి ధన్యవాదాలు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికుల జీతాల బకాయిల చెల్లింపు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పండగ కానుక కింద వెయ్యి రూపాయలు చెల్లించేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ సంస్థ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నగర మేయర్‌ను సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన క్రమంలో వారికి చెల్లించాల్సిన జీతాల్లో కోత విధించారని.. 9 నెలల పాటు మూడు వేల రూపాయలు జీతం తగ్గించి ఇచ్చారని చెప్పారు. దీనిపై పలుమార్లు నగర కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో బకాయిల చెల్లింపుపై స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపడం అభినందించదగ్గ విషయమన్నారు. అదే విధంగా ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మధుబాబు కూడా బకాయిలో చెల్లింపుపై హర్షం వ్యక్తం చేశారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆంజనేయులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రైతుల సమక్షంలోనే మిర్చి బస్తాలు కాటాలు వేయాలని, తూకాల్లో తేడాలు వస్తే సహించేది లేదని యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు హెచ్చరించారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో కాపలాదారులు, వేమెన్స్‌తో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. వేమెన్స్ లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వేమెన్స్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అంతేకాకుండా డ్రస్ కోడ్, ఐడీ కార్డులతో పాటు బయోమెట్రిక్ హాజరుతో రైతులు, వ్యాపారుల సమక్షంలో ఈ-నామ్ పద్ధతిలో కాటాలు వేయాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, యార్డు పర్సన్ ఇన్‌చార్జి భార్గవ్ తేజ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో వేమెన్స్ అసోసియేషన్ నాయకులు శ్రీహరి, శ్రీనివాసరెడ్డి, బాబు, సోమేష్, పలువురు వేమెన్స్, కాపలాదారులు పాల్గొన్నారు.

ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర

జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ



చేబ్రోలులో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేసీ

చేబ్రోలు: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. మండల కేంద్రమైన చేబ్రోలులో జీబీసీ రోడ్డు పక్కన రైతులు ఆరబెట్టిన ధాన్యం రాసులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం 75 కిలోల బస్తా రూ.1740లకు మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని చెప్పారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యాన్ని టార్పాలిన్ పట్టాలతో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నట్లు రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట తహసీల్దారు కే శ్రీనివాసశర్మ, ఏవో శ్రీనివాస నాయక్ ఉన్నారు.

గ్యాస్ గోడౌన్ తనిఖీ..

చేబ్రోలులోని భారత్ గ్యాస్ కంపెనీని శుక్రవారం తహసీల్దారు కే శ్రీనివాసశర్మ తనిఖీ చేశారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో సిబ్బంది అదనంగా డబ్బులు వసూలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కంపెనీ మేనేజర్‌కు తహసీల్దారు సూచించారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటల్స్, వ్యాపార వర్గాలు వినియోగించకుండా దృష్టి పెట్టాలన్నారు.